క్లుప్తంగా

ఇళ్లు త్వరగా నిర్మించుకోండి

రొద్దం: మండల కేంద్రంలోని జగనన్న లేఔట్‌లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్ సోని లబ్ధిదారులకు సూచించారు. గురువారం ఆమె లబ్ధిదారులతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నా కొందరు లబ్ధిదారులు నిర్మాణాలను పునాదులు, గోడల వరకే పరిమితం చేశారన్నారు. ఇప్పటికైనా స్పందించి నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఐకేపీ సీసీ సుధాకర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు ఐకేపీ తరఫున రూ.30 వేలు వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తామన్నారు.

తూకాలు, నాణ్యతలో తేడాలుంటే ప్రశ్నించండి

పరిగి: దుకాణాల్లో సరుకులు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉంటే మోసాలకు చెక్ పెట్టవచ్చని శ్రీసత్యసాయి జిల్లా వినియోగదారుల సేవా సంఘం అధ్యక్షుడు బాబయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కృపా సత్యరాజు అధ్యక్షతన విద్యార్థులకు వినియోగదారులకు ఉన్న హక్కులపై అవగాహన కల్పించారు. విక్రయదారులు తూకాలు, ధరలతో మోసాలకు పాల్పడితే వినియోగదారుల ఫోరంకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎంఈఓ శేషాచలం, వెంకటరమణ పాల్గొన్నారు.

తీరిన తాగునీటి సమస్య


బోరు బావి నుంచి ఉబికి వస్తున్న నీరు

అమరాపురం: హనుమంతనపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో నీటి సమస్య పరిష్కారమైంది. తాగునీటి కోసం కాలనీ వాసులు పదేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఎంపీటీసీ నరసింహమూర్తి, సర్పంచ్ భాగ్యమ్మ, ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. మండల పరిషత్ నిధులను మంజూరు చేయడంతో గురువారం 500 అడుగుల మేర బోరు బావి తవ్వించగా 3 అంగుళాల నీరు లభించింది.

బ్రాహ్మణ సమాజం ఐక్యతగా ఉండాలి


వృద్ధ దంపతులను సన్మానించిన దృశ్యం

హిందూపురం: హిందూపురం బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీకంఠపురం శివాలయంలో గురువారం కార్తీక వనభోజన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర కోశాధికారి మనోహరరావు హాజరై వృద్ధ దంపతులకు నూతన వస్త్రాలు సమర్పించారు. వక్తలు మాట్లాడుతూ బ్రాహ్మణ సమాజం ఐక్యతగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు మురళీ దేశాయ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సభ్యులు హెచ్‌కె.రాజశేఖర్‌రావు, సుండుపల్లి గాయిత్రీ, రూప, సంధ్య, రాఘవేంద్ర, ప్రసాదరావు, కొటిపి హనుమంతరావు, కల్లూరు ఆదినారాయణ, విజయభాస్కర్, అనిల్‌కుమార్, ఆదినారాయణ పాల్గొన్నారు.

మత సామరస్యంపై పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న సుధేష్

సోమందేపల్లి: భారతీయులంతా మత సామరస్యంతో మెలగాలని ఆకాంక్షిస్తూ హరిద్వార్ నుంచి రామేశ్వరం వరకూ పాదయాత్రను ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాకు చెందిన రైతు సుధేష్ చేపట్టారు. దాదాపు 72 రోజులుగా పాదయాత్రగా కొనసాగుతూ వచ్చిన ఆయన గురువారం సోమందేపల్లికి చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులతో ఆయన మాట్లాడుతూ మత సామరస్యంపై చైతన్య పరిచారు. హరిద్వారలో తీసుకున్న గంగా జలంతో రామేశ్వరంలోని రామలింగేశ్వరుడికి అభిషేకం చేయనున్నట్లు వివరించారు.

యాత్రకు జనజాతర


గుడిబండ నుంచి బైక్ ర్యాలీగా మడకశిరకు విచ్చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


జనసంద్రంగా మారిన మడకశిరలోని వైఎస్సార్ సర్కిల్

మిద్దెలపై జనం.. రోడ్లలో జనం..పల్లెదారుల్లో జనం..పట్టణ వీధుల్లో జనం..ఇది గురువారం మడకశిర నియోజకవర్గ కేంద్రంలో ఆవిష్కృతమైన దృశ్యం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సీఎం వైఎస్ జగనన్న చేసిన మేలును వివరిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మడకశిరలో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు ఉప్పెనలా తరలివచ్చారు. నియోజకవర్గంలోని మడకశిర, రొళ్ల, అగళి, అమరాపురం, గుడిబండ మండలాలనుంచి మహిళలు, రైతులు, కర్షకులు, కార్మికులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా హాజరై జయహో జగన్ అంటూ నినదించారు. సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. సభలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సింగిల్ విండో అధ్యక్షులు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, మండల కన్వీనర్లు, జేసీఎస్, సచివాలయ కన్వీనర్లు, కౌన్సిలర్లు, పార్టీ వివిధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

–మడకశిర


సాంస్కృతిక కార్యక్రమంలో బాలికల నృత్యం


సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, చిత్రంలో మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ


సామాజిక సాధికారత బస్సు యాత్రకు హాజరైన అశేష జనవాహిని

మరోమారు జగనన్నను ఆశీర్వదించండి

హిందూపురం: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్నే రావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. అరవిందనగర్‌లో 35వ వార్డు కౌన్సిలర్ జయప్ప ఆధ్వర్యంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఆమె ముఖ్య అతిథిగా హాజరై వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. నవరత్నల్లో భాగంగా నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వార్డులో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు వివరించే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల దుష్ప్రచారం, తప్పుడు వాగ్దానాలు నమ్మి మోసపోవద్దన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. పథకాలు ఇలాగే కొనసాగాలంటే జగనన్నను మరోమారు ఆశీర్వదించాలన్నారు. ఎన్నికలు వస్తే తప్ప హిందూపురం గుర్తుకు రాని ఎమ్మెల్యే ఇంకా అవసరమా? అని ప్రశ్నించారు. ప్రజలు ఆలోచించి రానున్న ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్‌సీపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా మున్సిపాల్టీ పరిధిలోని 13వ వార్డు కౌన్సిలర్ సునిత ఆధ్వర్యంలో అరవిందనగర్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ కౌన్సిలర్ సునితతో కలిసి పార్టీ


హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న కౌన్సిలర్ జయప్ప, చైర్‌పర్సన్ ఇంద్రజ

జెండా ఆవిష్కరించి వార్డులో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ మారుతి, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఏ బ్లాక్ కన్వీనర్ సాధిక్, కౌన్సిలర్లు శివ, ఆసీఫ్, షాజియా, మణి, చంద్ర, గిరి, నాగేంద్రమ్మ, రోషన్, కార్పొరేషన్ డైరెక్టర్లు రవీంద్ర, లక్ష్మీనారాయణ, నాయకులు ఆర్‌కె ఖలీల్, బాబు, కవిత, చాంద్, దాదు, మల్లికాబాను, బాను, తిమ్మారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శివశంకర్, నౌషాద్, మార్కెట్ యార్డు సభ్యులు ఫరూక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: ఎర్రగుంటలో సర్పంచ్ బాలకృష్ణ అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. నాలుగున్నర సంవత్సరాల్లో సీఎం జగన్ అమలు చేసిన పథకాలను ప్రజలపై రూపొందించిన బోర్డును నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆవిష్కరించారు. మండల కన్వీనర్ నరసింహమూర్తి, జేసీఎస్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీటీసీ మారుతీరెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

లేపాక్షి: లేపాక్షి-2 గ్రామ సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ నారాయణస్వామి, సర్పంచ్ ఆదినారాయణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రభాకర్, జేసీఎస్ మండల కన్వీనర్ శ్యాంప్రసాద్‌రెడ్డి పాల్గొని వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సచివాలయ పరిధిలో నాన్ డీబీటీ కింద రూ.49.93 కోట్ల మేర ప్రజలకు లబ్ధి జరిగిందన్నారు. శ్రీనివాసులు, మైనార్టీ నాయకుడు ఇర్ఫాన్, తిప్పన్న పాల్గొన్నారు.

రొద్దం: ఆర్.లోచెర్లలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం సంక్షేమ పథకాల బోర్డు ప్రదర్శించారు. ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ గంగాధర్, జేసీఎస్ కన్వీనర్ ఆర్‌వి రవిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

హిందూపురం: మలుగూరులో సర్పంచ్ రమేష్, మండల కన్వీనర్ రాము ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఎంపీటీసీ ఏ కాశప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్, నాగరాజు, సోము, వెంకటేష్, రామాంజి పాల్గొన్నారు.


పరిగి: ఎర్రగుంటలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ ఆవిష్కరణ


లేపాక్షిలో సంక్షేమ పథకాల వివరాలున్న బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు


రొద్దం: ఆర్.లోచెర్లలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం


హిందూపురం మండలం మలుగూరులో ఇంటింటికి వెళ్లి ప్రచారం

ఘనంగా సాయుధ దళాల పతాక దినోత్సవం


ఆర్థిక సాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ దేశరక్షణ కోసం సాయుధ దళాల్లో పనిచేస్తూ వీరమరణం పొందినవారిని స్మరించుకోవాలన్నారు. అమరవీరుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ విరాళాలు అందించాలన్నారు.

ఘనంగా ఉరుసు


గంధం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద కొలువైన హజరత్ షా గై బాషావలి బాబా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గంధం వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. గురువారం దీపాల పూజల అనంతరం అన్నదానం చేసినట్లు నిర్వాహకులు ఖాదర్ సాబ్, ఇంతియాజ్, ఇమ్రాన్, బాబా తెలిపారు.

ఫోర్టిఫైడ్ బియ్యంపై అపోహ వద్దు

పెనుకొండ రూరల్: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంపై అపోహలు అవసరం లేదని ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ తస్లీమా తెలిపారు. పట్టణంలోని బీటీఆర్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. సూక్ష్మ పోషక లోపాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యంను పంపిణీ చేస్తోందన్నారు.


అవగాహన కల్పిస్తున్న తస్లీమా

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

రొద్దం: మండల కేంద్రంలోని పలు హోటళ్లు, సూపర్ మార్కెట్, బిర్యానీ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో గురువారం సాయంత్రం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమా తనిఖీ చేశారు. కొన్ని దుకాణాల్లో కాలం చెల్లిన బిస్కెట్లు, తినుబండారాలను గుర్తించినట్లు తెలిపారు. ఒక బిర్యానీ హోటల్‌లో రుచి కోసం కలర్లు ఎక్కువగా కలుపుతున్నట్లు గుర్తించి శాంపుల్స్ సేకరించినట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ప్రజలపై ఆరోగ్యాలపై చెలగాటమాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

అమరాపురం: దివ్యాంగులను సకలాంగులతో సమానంగా చూడాలని ఎంఈఓ-2 వెంకటరమణనాయక్, ఎస్టీఎల్ అనసూయమ్మ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్టీటీ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దివ్యాంగులకు ఇష్టమైన రంగంలో సరైన శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తే వారు ఉన్నతంగా రాణిస్తారన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు అనేక పథకాలను అమలు చేసిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఐఈఆర్టీ కుసుమ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటరమణనాయక్

నేడు ఎమ్మెల్యే పర్యటన

గోరంట్ల: ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ శుక్రవారం మండలంలో పర్యటించనున్నారు. బూదిలి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా, విలేజ్ క్లినిక్‌ను ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ శుక్రవారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప తెలిపారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

విత్తన రాగులకు పేర్లు నమోదు చేసుకోండి

రొళ్ల: రబీ సీజన్‌లో బోరుబావుల కింద రాగి పంట సాగుకు ప్రభుత్వం సబ్సిడీతో రాగి విత్తనాలు అందజేస్తోందని వీఏఏ ప్రసన్నకుమార్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఒక్కొక్క రైతుకు 4 కిలోల చొప్పున 50 శాతం రాయితీ (కేజీ రూ.35 ధర)తో పంపిణీ చేస్తామన్నారు. రైతులు పట్టదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు తీసుకువచ్చి ఆర్‌బీకేలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటే వారం రోజుల్లోగా విత్తన రాగులు పంపిణీ చేస్తామన్నారు.

వైద్య సిబ్బందిని నియమించాలి

హిందూపురం టౌన్: స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్య సిబ్బందిని నియమించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గైనకాలజిస్టును నియమించాలని, ఆస్పత్రిలో సిటీ స్కాన్‌ను రోగులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వినోద్, మారుతీరెడ్డి, నౌషాద్, ముత్యాలప్ప, సురేష్, భక్తర్, నౌషాద్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

హిందూపురం: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ గౌతమి అన్నారు. మండలంలోని హనుమేపల్లిలో వాసవ్య మహిళా మండలి, విప్రోకేర్ సహకారంతో కుశాల్ హెల్త్ క్లినిక్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 69 మందికి ఆమె వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. రంగయ్య, లక్ష్మమ్మ, కృష్ణవేణి, రాధమ్మ, శిరీషా, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయిబాబాకు దీపోత్సవం

అమరాపురం: మండల కేంద్రంలో కొలువైన శ్రీషిరిడీ సాయి బాబాకు భక్తులు గురువారం రాత్రి ఘనంగా దీపోత్సవం నిర్వహించారు. అర్చకుడు హరీష్‌భట్టాచార్యులు స్వామి వారిని వివిధ పుష్పాలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి కార్తీకమాసం సందర్భంగా దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. తర్వాత అర్చకులు స్వామివారికి మహా మంగళ హారతి ఇచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రసాదాలు పంపిణీ చేసింది.

రక్తదానంతో పునర్జన్మ ఇవ్వండి

పావగడ: అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్త దానం చేయడానికి ముందుకు రావాలని స్థానిక వైఈ రంగయ్య శెట్టి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీధర్ పిలుపు ఇచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, కళాశాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. రక్త దానంతో మరొకరి ప్రాణాలు కాపాడాలన్నారు. అనంతరం 56 మంది విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం అందించారు. సేకరించిన రక్తాన్ని తుమకూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. బ్యాంకు మేనేజర్ గౌతమ్, తుమకూరు రక్తనిధి కేంద్రం వైద్యుడు డా శేక్, హరీశ్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన


శిబిరార్థులతో వైద్యురాలు నమ్రత

పావగడ: మనిషికి అతి ముఖ్యమైన అవయవాలు గుండె, శ్వాస కోశ పునరుజ్జీవన (సీపీఆర్) శిక్షణా శిబిరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం ప్రారంభమైంది. హఠాత్తుగా గుండె నిలిచి పోయిన వ్యక్తుల ప్రాణాలను రక్షించడానికి తక్షణమే అందించాల్సిన సీపీఆర్ చికిత్సపై శిబిరార్థులకు వైద్య నిపుణురాలు డాక్టర్ నమ్రత అవగాహన కల్పించారు. సీపీఆర్ నిర్వహిస్తే ప్రముఖ అవయవాలకు ముఖ్యంగా మెదడుకు రక్తం అందుతుందన్నారు. డిఫిబ్రిలేటర్‌ను ఎలా ఉపయోగించాలో నేర్పించారు. ఈ శిబిరంలో డాక్టర్ ఏఎస్‌ఎల్ బాబు, చంద్రకళ, ఓంకార్, ఎండీ ఖాసీం పాల్గొన్నారు.